సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
సోమవారం । 13 । ఫిబ్రవరి । 2023



సింగరేణి ప్రైవేటీకరణకు కుట్ర
సింగరేణిని ప్రైవేట్‌పరం చేసేందుకు ప్రభుత్వాలు కుట్ర పన్నుతున్నాయని ప్రొఫెసర్ కోదండరామ్ విమర్శించారు. 10లో



అభయారణ్య అందాల వీక్షణం
కిన్నెరసాని పర్యాటక ప్రాంతానికి ఆదివారం జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో సందర్శకులు తరలివచ్చారు. 8లో

గరిష్టం / కనిష్టం
37° / 17°

వాతావరణం
జిల్లాలో సోమవారం మధ్యాహ్నం ఎండ తీవ్రత ఉంటుంది. రాత్రి వేళ చలి ప్రభావం ఉండవచ్చు

న్యూస్‌రీల్

శ్రీకనకదుర్గమ్మ తల్లికి విశేష పూజలు



పెద్దమ్మతల్లి ఆలయం ఎదుట భక్తుల రద్దీ

పాల్వంచరూరల్: శ్రీకనకదుర్గమ్మ తల్లికి అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. శ్రీకనకదుర్గ(పెద్దమ్మతల్లి)ఆలయానికి ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దీంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు క్యూలైన్ ద్వారా వెళ్లి అమ్మవారిని దర్శించుకుని పూజలు జరిపారు. తలనీలాలు సమర్పించుకున్నారు. ఒడిబియ్యం, చీరలు, కుంకుమ, పసుపు, గాజులు అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించారు. అర్చకులు అమ్మవారికి అభిషేకం జరిపారు.

18న రుద్రహోమపూజలు
పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లి ఆలయంలో మాసశివరాత్రి సందర్భంగా ఈ నెల 18న రుద్రహోమ పూజలు నిర్వహించనున్నట్లు ఈఓ ఎస్.రజనీకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. హోమ పూజలో పాల్గొనే భక్తులు రూ.1,516 చెల్లించి గోత్ర నామాలను నమోదు చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు 98669 23261, 63034 08458 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

బొగ్గు ఉత్పత్తి పరిశీలన
ఇల్లెందు: సింగరేణి డైరెక్టర్లు ఎన్‌వీకే శ్రీనివాస్, వెంకటేశ్వరరెడ్డి ఆదివారం ఇల్లెందు ఏరియాలోని జేకే–5ఓసీని సందర్శించారు. వ్యూపాయింట్ నుంచి బొగ్గు ఉత్పత్తి ప్రక్రియను పరిశీలించారు. అధికారులతో పలు విషయాలు చర్చించారు. అనంతరం బుగ్గవాగు మీద చేపడుతున్న నూతన బ్రిడ్జి నిర్మాణ పనులను పరిశీలించారు. తొలుత ఇల్లెందులో ఏరియా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్లు మాట్లాడుతూ ఇల్లెందు ఏరియాలో కొత్తగా జేకే ఓసీ ఏర్పాటుకు కృషి చేద్దామని తెలిపారు. అధికారులు శ్రీనివాస్, గిరిధర్‌రావు, మోహన్‌రావు, శేఖర్‌బాబు పాల్గొన్నారు.


డైలీవేజ్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి
అసెంబ్లీలో ఇల్లెందు ఎమ్మెల్యే హరిప్రియ



అసెంబ్లీలో మాట్లాడుతున్న హరిప్రియ

ఇల్లెందు: ఆశ్రమ పాఠశాలలు, హాస్టళ్లు, పీహెచ్‌ఎంలలో పని చేస్తున్న డైలీవేజ్ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని ఇల్లెందు ఎమ్మెల్యే హరిప్రియ కోరారు. ఆదివారం అసెంబ్లీలో ఆమె మాట్లాడుతూ గిరిజన సంక్షేమ పాఠశాలల్లో పని చేస్తున్న మహిళలు అతి తక్కువ వేతనంతో పని చేస్తున్నారని పేర్కొన్నారు. ఎన్నో రోజులుగా ఆందోళన చేస్తున్నారని, వారిని ఆదుకోవాలని కోరారు. గిరిజన గురుకులాలు, ఆశ్రమ పాఠశాలలు, హాస్టళ్లలో కూడా బదిలీల ప్రక్రియ చేపట్టాలని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా విద్యార్థుల మెస్ చార్జీలు పెంచాలని కోరారు.

'సుకన్య సమృద్ధి'లో ముందంజ
పోస్టల్ సూపరింటెండెంట్ రవికుమార్



మాట్లాడుతున్న పోస్టల్ సూపరింటెండెంట్ రవికుమార్

అశ్వారావుపేట: తెలంగాణ పోస్టల్ సర్కిల్‌లో ఫిబ్రవరి 9,10,11 తేదీల్లో సుకన్య సమృద్ధి పథకంలో 34,384 కొత్త ఖాతాలు ప్రారంభించగా, అందులో ఖమ్మం డివిజన్‌లో అత్యధికంగా 4,266 ఖాతాలు ప్రారంభించామని ఖమ్మం డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ బి.రవికుమార్ తెలిపారు. ఆదివారం పోస్టాఫీస్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ పథకంలో చేరిన భవాని అనే విద్యార్థిని ఇంజనీరింగ్ విద్య నిమిత్తం రూ.6,87,800 తీసుకున్నారని తెలిపారు. ఖమ్మం డివిజన్‌లో ఐదుగురు విద్యార్థులు లబ్ధిపొందారని పేర్కొన్నారు. పదేళ్లలోపు బాలికలు ఏడాదికి రూ.250 నుంచి రూ.1.5లక్షల వరకు 15ఏళ్లపాటు డిపాజిట్ చేయవచ్చని తెలిపారు. 18ఏళ్లు దాటిన తర్వాత ఉన్నత విద్యా అవసరాలకు 50శాతం సొమ్ము లేదా 18ఏళ్ల తర్వాత వివాహ అవసరాల కోసం ముందస్తుగా పథకం ద్వారా లబ్ధి పొందవచ్చని వివరించారు.

పోడులో బిజీ బిజీ..!



కలెక్టరేట్‌లో పోడు దరఖాస్తులపై కసరత్తు చేస్తున్న సిబ్బంది

కార్యదర్శి నుంచి కలెక్టర్ వరకు దరఖాస్తుల వెరిఫికేషన్‌లోనే..
- త్వరలోనే పట్టాలిస్తామని ప్రకటించిన ప్రభుత్వం
- జిల్లాలో లబ్ధిదారుల ఎంపికపై తీవ్ర కసరత్తు
- ఐదు రోజులుగా పరిశీలన, నేడు జాబితాపై స్పష్టత



సిబ్బందికి సూచనలు ఇస్తున్న కలెక్టర్ అనుదీప్

చుంచుపల్లి: పోడు భూములకు త్వరలోనే పట్టాలను ఇస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో జిల్లాలో లబ్ధిదారుల ఎంపికపై అధికారులు కసరత్తు చేస్తున్నారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి నుంచి కలెక్టర్ వరకు అర్హులను గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు. బుధవారం నుంచి అధికారులు అందరూ ఇదే పనిలో ఉన్నారు. పోడు దరఖాస్తుల స్వీకరణ నుంచి భూముల సర్వే వరకు సేకరించిన అన్ని వివరాలను మరోసారి తిరిగి పరిశీలిస్తున్నారు. ఐదు రోజులుగా పరిపాలన పరమైన పనులు కూడా పక్కనపెట్టి ఐడీఓసీలో ఎస్‌డీఎల్సీ(సబ్ డివిజన్ లెవల్ కమిటీ) స్థాయికి చేరిన దరఖాస్తులను అధికారులు పరిశీలిస్తున్నారు. దీంతో కలెక్టరేట్ సముదాయం సందడిగా మారింది. ఇక శనివారం రోజున చేపట్టిన దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ ఏకంగా ఆదివారం తెల్లవారుజాము వరకూ కొనసాగింది. పోడు పట్టాల అర్హుల ఫైనల్ లిస్ట్ వెరిఫికేషన్ విధుల్లో ఉన్న సిబ్బందికి కలెక్టరేట్‌లోనే భోజనం సదుపాయం కల్పిస్తున్నారు. పోడు దరఖాస్తుల వెరిఫికేషన్‌ను కలెక్టర్ అనుదీప్, డీఎఫ్ఓ సిద్ధార్థ్ విక్రంసింగ్, ఐటీడీఏ పీఓ గౌతమ్ పొట్రు నిరంతరం పర్యవేక్షిస్తూ సిబ్బందికి తగిన సూచనలు సలహాలు ఇస్తున్నారు. వీరు కూడా ఒక్కో రోజు రాత్రి 12 గంటల వరకు ఉండాల్సి వస్తోంది. దరఖాస్తుల పున:పరిశీలన తంతు దాదాపు చివరి దశకు చేరుకుంది. మిగిలిన కొన్నింటిని సోమవారం మధ్యాహ్నం వరకు పూర్తి చేసి సాయంత్రానికి తుది జాబితాకు ఆమోదం తెలిపే అవకాశం ఉంది. ఈ క్రమంలోనే సోమవారం నిర్వహించాల్సిన గ్రీవెన్స్‌ను అధికారులు తాత్కాలికంగా రద్దు చేశారు.

విధుల్లో 520 మందికి పైగా సిబ్బంది
జిల్లాలో పోడు అర్హులను గుర్తించే ప్రక్రియను రెవెన్యూ, ఐటీడీఏ శాఖలు చూస్తున్నాయి. కలెక్టరేట్ సముదాయంలో దరఖాస్తుల పరిశీలన సాగుతుండగా, ఈ వెరిఫికేషన్ పనుల్లో 21 మంది తహసీల్దార్లు, 21 మంది ఎంపీడీఓలు, 21 మంది ఎంపీఓలు, 370 మంది పంచాయతీ కార్యదర్శులు, 42 మంది కంప్యూటర్ ఆపరేటర్లు, 15 మంది ఐటీడీఏ సిబ్బంది, ఆరుగురు ఎఫ్‌డీఓలు, 22 మంది ఎఫ్ఆర్వోలు, అదనపు కలెక్టర్, డీఆర్వో, కలెక్టరేట్ ఏఓ తదితరులు భాగస్వాములతున్నారు. పోడు దరఖాస్తుల పునఃపరిశీలనలో ప్రధానంగా సాగుదారుడు దరఖాస్తు చేసే సమయంలో జతచేసిన కుల ధ్రువీకరణ పత్రాలు, ప్రస్తుతం సాగు చేస్తున్న పోడు వివరాలు, స్థానికత ఆధారాలు, ఒక వేళ ఉద్యోగి అయితే అవి, బినామీ పేర్ల మీద ఉంటే వాటిని, రెవెన్యూ లేదా ఫారెస్ట్ భూమి అయితే వాటి వివరాలను అంశాల వారీగా పరిశీలిస్తున్నారు. పోర్టల్‌లో నమోదైన విధంగా ఒక్కో దరఖాస్తుదారుడు ఎన్ని ఎకరాల భూమిని ఆక్రమించింది, ఒక వేళ 10 ఎకరాలకు పైబడి సాగు చేస్తే వివరాలను మరోసారి చెక్ చేస్తున్నారు. ఇక గిరిజనేతరులైతే తాను ఆన్‌లైన్‌లో పొందుపరిచిన వివరాలతో పాటు మూడు తరాలకు సంబంధించిన ఆధారాలను పరిగణనలోకి తీసుకుంటున్నారు. గిరిజనుల విషయంలో 2005 డిసెంబర్ 13 ముందు నిబంధనల ప్రకారం పోడు దరఖాస్తులను స్క్రూట్నీ చేస్తున్నారు. ఈ పోడు దరఖాస్తుల పున: పరిశీలన ప్రక్రియ 98 శాతం వరకు పూర్తయింది. ఇప్పటికే ఒకవైపు పోడు అర్హులకు సంబంధించిన హక్కు పత్రాలను ఇప్పటికే పీడీఎఫ్‌లో డిజైన్ చేసి సిద్ధంగా ఉంచారు. సోమవారం కొంత భాగం సిబ్బంది హక్కు పత్రాల్లో తప్పులను పరిశీలించనున్నారు. జిల్లాలో 1.37 లక్షల ఎకరాల పరిధిలో 48,540 దరఖాస్తులను ఎస్‌డీఎల్సీలో పరిశీలించి ఆమోదం తెలిపారు. ప్రాథమిక సమాచారం సోమవారం జరిగే వెరిఫికేషన్ అనంతరం జిల్లాలో 41 వేల పోడు దరఖాస్తుల పరిధిలో 1.25 లక్షల ఎకరాలకు హక్కు కల్పిస్తూ డీఎల్సీ ఆమోదంతో తుది జాబితాగా ప్రకటించే అవకాశం ఉందని తెలిసింది.

కాంగ్రెస్ కార్యాలయాన్ని అప్పగించాలి



మాట్లాడుతున్న టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి

- మణుగూరులోని పార్టీ ఆఫీస్‌ను ఎమ్మెల్యే రేగా ఆక్రమించుకున్నాడు
- విలేకరుల సమావేశంలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి

అశ్వాపురం: కమీషన్లను, అక్రమాలను కప్పిపుచ్చుకునేందుకు పార్టీ ఫిరాయించిన పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు ఆక్రమించుకున్న పినపాక నియోజకవర్గ కాంగ్రెస్ కార్యాలయాన్ని వెంటనే పార్టీకి అప్పగించాలని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని గొల్లగూడెంలో పాదయాత్ర శిబిరంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పినపాకలో నియోజకవర్గ ప్రజలు 2018 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఆదరించి గెలిపించారన్నారు. గెలిచిన ఎమ్మెల్యే కార్యకర్తలను, కాంగ్రెస్ పార్టీని మోసం చేసి కమీషన్లు, కాంట్రాక్టులు, అక్రమాలను కప్పి పుచ్చుకునేందుకు పార్టీ ఫిరాయించారని ఆరోపించారు. పినపాక నియోజకవర్గ కేంద్రం మణుగూరులో తాతల కాలంలో అప్పటి నాయకులు స్థలం ఇచ్చారని, దీంతో పార్టీ కార్యకర్తలు రూపాయి రూపాయి పోగు చేసి కార్యాలయం నిర్మిస్తే.. దోపిడి విధానంతో స్థానిక ఎమ్మెల్యే ఆ కార్యాలయాన్ని ఆక్రమించుకున్నాడని ఆరోపించారు. ఇది దుర్మార్గమైన చర్య అని, రాజకీయంగా విజ్ఞతతో వ్యవహరించాలని పేర్కొన్నారు. అధికారం ఉంది కదా అని విర్రవీగితే సరైన సమయంలో తగిన మూల్యం చెల్లించాల్సి ఉంటుందని హెచ్చరించారు. అధికారంలో ఉన్నామని, సీఎం కేసీఆర్ అండగా ఉన్నారని ఎమ్మెల్యే తన ఇష్టం వచ్చినట్టు చేస్తే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక తీసుకునే చర్యలకు ఎమ్మెల్యే సిద్ధంగా ఉండాలని పేర్కొన్నారు. పినపాకలో పార్టీ నియోజకవర్గ బాధ్యులుగా ఐదు, ఆరుగురు ఉన్నారని, ఎవరు బాధ్యులో త్వరలో అధికారికంగా ప్రకటిస్తామని తెలిపారు. అసెంబ్లీ సమావేశాలు నడుస్తున్న కారణంగా డీసీసీ అధ్యక్షుడు, భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య పాదయాత్రలో పాల్గొనలేదని, ములుగులో యాత్రకు హాజరయ్యారని, ఏఐసీసీ అనుమతితోనే ఈ యాత్ర కొనసాగుతోందని వివరించారు. ఆయా ప్రాంతాల్లో ఆయా సందర్భాల్లో సీనియర్ నాయకులు అందరూ పాదయాత్రలో పాల్గొంటారని పేర్కొన్నారు. జిల్లాలో పోడు భూముల సమస్య తీవ్రంగా ఉందని, కానీ పోడు సమస్యపై సీఎం కేసీఆర్‌కు, బీఆర్ఎస్ పార్టీకి చిత్తశుద్ధి లేదని విమర్శించారు. పోడు సమస్యలు కాంగ్రెస్ పార్టీ మాత్రమే పరిష్కరిస్తుందని, గతంలో పోడు భూములకు పట్టాలు ఇచ్చిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదేనని అన్నారు. ఏజెన్సీ ఏరియాలో నాన్ షెడ్యూల్ వారు కూడా అధిక సంఖ్యలో ఉన్నారని, వారి సమస్యలపై కూడా కాంగ్రెస్ పార్టీ ఒక కార్యాచరణ తీసుకుంటుందని తెలిపారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మల్లు రవి, ఎడవల్లి కృష్ణ, మాజీ ఎమ్మెల్యే చందా లింగయ్య, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సృజనాత్మకత పెంపొందించుకోవాలి
మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ



మాట్లాడుతున్న అల్లం నారాయణ

కొత్తగూడెంఅర్బన్: ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూనే పాత్రికేయులు సృజనాత్మకతను పెంపొందించుకోవాలని రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ సూచించారు. తెలంగాణ మీడియా అకాడమీ ఆధ్వర్యంలో సింగరేణి మహిళా కళాశాలలో శనివారం ప్రారంభమైన పాత్రికేయుల శిక్షణ తరగతులు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా అల్లం నారాయణ మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా పాత్రికేయులకు అన్ని అంశాలపై సమగ్రమైన అవగాహన ఉండాలని, వాస్తవాలను ప్రజలకు చెప్పాలని ఉద్బోధించారు. రాతి యుగం నుంచి నేటి యుగం వరకు పాత్రికేయులు ఎంతో సమాచారాన్ని ప్రజలకు చేరువ చేస్తున్నారని చెప్పారు. సాంకేతికంగా అభివృద్ధి చెందిన నేపథ్యంలో కొత్త ఆలోచనలతో ముందుకు సాగాలని సూచించారు. అన్యాయానికి గురైన బాధితులు పక్షాన న్యాయం జరిగేలా వార్తలు రాయాలని చెప్పారు. అనంతరం సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరి గౌరీ శంకర్, సీనియర్ జర్నలిస్టు దిలీప్‌రెడ్డి, రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ మాజీ చైర్మన్ ఘంటా చక్రపాణి, ఆంధ్రజ్యోతి ఎడిటర్ శ్రీనివాస్, సీనియర్ పాత్రికేయుడు బుచ్చన్న తరగతులు బోధించారు. శిక్షణా కార్యక్రమాల్లో పాల్గొన్న జర్నలిస్టులకు సర్టిఫికెట్లు, వార్తల సేకరణపై తయారు చేసిన పుస్తకాలను అందచేశారు. ఈ కార్యక్రమంలో సింగరేణి డైరెక్టర్ (పా) బలరాం, జీఎం ఆనందరావు, తెలంగాణ మీడియా అకాడమీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, మేనేజర్ వెంకటేశ్, పీఆర్వో వనజ, ఓఎస్డీ రహమాన్, టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు కల్లోజి శ్రీనివాస్, వట్టికొండ రవి, నరసింహారావు, చంద్ర నరసింహారావు, షఫీ, బాలయోగి తదితరులు పాల్గొన్నారు.

దారి తప్పి స్టెతస్కోప్ పట్టుకున్నా..
జర్నలిస్టుల శిక్షణ కార్యక్రమానికి హాజరైన రాష్ట్ర హెల్త్ డైరెక్టర్ గడల శ్రీనివాసరావు చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంగా మారాయి. తాను భద్రాచలం ఏరియా నుంచి వచ్చినవాడినని, అంతా కూడా అన్నల(నక్సలైట్ల) అడుగుజాడల్లో పెరిగిన జీవితమని, దారి తప్పి స్టెతస్కోప్ పట్టుకున్నానని, లేకపోతే గన్ను పట్టుకుని అడవి లోపలికి వెళ్లి ప్రస్తుతం శ్రీనివాస్ అమరహే అనే పరిస్థితి వచ్చేదని హెల్త్ డైరెక్టర్ వ్యాఖ్యానించారు. మీరంతా నా కుటుంబమని, అందుకే చెబుతున్నానంటూ పేర్కొన్నారు. తన మాటలను జర్నలిస్టులు ఎన్నో సార్లు వక్రీకరించి సోషల్ మీడియాలో పెట్టారని, తనకూ కుటుంబం, మనస్సు ఉన్నాయని.. నొప్పించే, టీఆర్పీ కోసం చేస్తున్న పనులు సరికాదని అన్నారు.

నేటి ప్రజావాణి రద్దు
కొత్తగూడెంఅర్బన్: పోడు భూముల పట్టాల జారీ ప్రక్రియకు సంబంధించి జిల్లా స్థాయి అటవీ హక్కుల కమిటీ సమావేశం నిర్వహిస్తున్న కారణంగా సోమవారం జరిగే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు డీఆర్వో అశోక చక్రవర్తి తెలిపారు.

జాతీయ స్థాయిలో ప్రతిభ
పాల్వంచ: ఈ నెల 5వ తేదీ నుంచి 12వ తేదీ వరకు రాజస్థాన్ రాష్ట్రం జైపూర్‌లో జరిగిన జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్వంచకు చెందిన ఇంటూరి రవికుమార్, అనిత దంపతుల కుమారుడు ఇంటూరి వర్షిత్ శ్రీసాయి పాల్గొని ప్రతిభ కనబర్చాడు. యోనెక్స్ సన్‌రైస్ ఆల్ ఇండియా సబ్ జూనియర్ బ్యాడ్మింటన్–2023 టోర్నీ అండర్–17 విభాగంలో పాల్గొని రన్నర్‌గా నిలిచాడు. దీంతో మెడల్, ప్రశంసా పత్రం, నగదు బహుమతులను అందుకున్నాడు. వర్షిత్ శ్రీ సాయి ప్రస్తుతం హైదరాబాద్‌లో నేషనల్ కోచ్ పుల్లెల గోపిచంద్ బ్యాడ్మింటన్ అకాడమీలో శిక్షణ పొందుతున్నాడు. ఈ సందర్భంగా చిన్నారిని పలువురు అభినందించారు.



బహుమతి సాధించిన వర్షిత్ శ్రీ సాయి

భద్రగిరి క్షేత్రంలో భక్తుల సందడి



వేడుకకు హాజరైన భక్తులు

భద్రాచలం: శ్రీసీతారామచంద్రస్వామి వారి దేవస్థానం ఆదివారం భక్తులతో సందడిగా మారింది. వారాంతపు సెలవు దినాలు కావడంతో స్వామి వారిని దర్శనాలతో పాటుగా ఆర్జిత సేవల్లో సైతం భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. పవిత్ర గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించిన అనంతరం స్వామి వారి మూలమూర్తులను ప్రత్యేక క్యూలైన్ల ద్వారా దర్శించుకుని పూజలు చేశారు. తెల్లవారుజామున స్వామి వారి మూలమూర్తులకు జరిగిన అభిషేకంలో 47 జంటలు, నిత్యకల్యాణంలో అత్యధికంగా 137 జంటలు, సువర్ణపుష్పార్చనలలో 102 మంది పాల్గొన్నారు. స్వామి వారికి జరిగిన ఆర్జిత సేవల ద్వారా ఆదివారం ఒక్కరోజే సుమారు రూ.10 లక్షల ఆదాయం వరకు సమకూరిందని ఆలయ వర్గాలు తెలిపాయి.

శాస్త్రోక్తంగా నిత్యకల్యాణం
తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం మేళతాళాల నడుమ గర్భగుడి నుంచి ఊరేగింపుగా తీసుకొచ్చి బేడా మండపంలో కొలువుదీర్చారు. విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం అనంతరం కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. ఆలయంలోని లడ్డూ కౌంటర్ల వద్ద కూడా రద్దీ నెలకొంది.



స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సేవల్లోనూ పెద్దదే..

- ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో ఆధునిక సౌకర్యాలు.. మెరుగైన చికిత్స
- రోజురోజుకూ పెరుగుతున్న తాకిడి
- గతేడాదితో పోలిస్తే 68వేల మేర పెరిగిన వైనం
- మెడికల్ కళాశాలగా మార్పుతో మరిన్ని సేవలు



పెద్దాస్పత్రిలో ఓపీ వద్ద క్యూలైన్‌లో వేచి ఉన్న ప్రజలు

ఖమ్మం వైద్యవిభాగం: ఖమ్మం జనరల్ ఆస్పత్రికి వైద్య సేవల కోసం వచ్చేవారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. పేదలకు ఉచిత వైద్యంతో పాటు బాధితులు, వారి వెంట వచ్చేవారికి భోజన సౌకర్యం ఏర్పాటు చేస్తున్నారు. సౌకర్యాలు మెరుగుపడటం, అన్ని రకాల వ్యాధులకు చికిత్స లభిస్తుండడంతో ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచే కాక చుట్టుపక్కల జిల్లాల వారు కూడా రోజుకు 1000 నుంచి 1200 మంది వైద్య సేవల కోసం వస్తున్నారు. కేసీఆర్ కిట్ ప్రవేశపెట్టడం, గైనిక్ సేవలు మరింత మెరుగుపడటంతో పెద్దాస్పత్రిలోని మాతా శిశు సంరక్షణ కేంద్రంలో రికార్డు స్థాయిలో ప్రసవాలు చేస్తున్నారు. జిల్లాలో జరిగే ప్రసవాల్లో 92 శాతం ఇక్కడే కావడం విశేషం.

అందుబాటులో ఆధునిక పరీక్షలు..
ప్రభుత్వం సౌకర్యాలు మెరుగు పరుస్తుండడం, వైద్య సేవలు విస్తృతం చేస్తుండటంతో ఖమ్మం ఆస్పత్రికి వచ్చే వ్యాధిగ్రస్తుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. జనరల్ మెడికల్ వైద్య సేవలతో పాటు కార్డియో, యూరాలజీ, నెఫ్రాలజీకి చెందిన వైద్య సేవలు అందుబాటులోకి రావడం కూడా తాకిడి పెరగడానికి మరో కారణం. అంతే కాక టిఫా స్కాన్, క్యాథ్‌ల్యాబ్ సేవలు కూడా అందుబాటులోకి తెచ్చారు. ప్రైవేటు సెంటర్లకు వెళ్లే అవసరం లేకుండా ఇక్కడే ఉచితంగా అత్యాధునిక టెస్టులు చేస్తున్నారు. 2021 – 22 ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 2022 – 23లో ఈ పది నెలల కాలంలోనే 68,510 మంది అదనంగా వైద్యసేవలు పొందడం గమనార్హం. 2021 –22లో 3,54,218 మంది ఔట్ పేషెంట్లు రాగా 2022 –23లో జనవరి వరకే 4,22,728 మంది వచ్చారు. ఇన్‌పేషెంట్ వైద్య సేవలు సైతం మెరుగైన స్థితిలోనే ఉన్నాయి.

పెద్దాస్పత్రిలో అందించిన సేవలిలా

	2021 ఏప్రిల్ నుంచి 2022 మార్చి	2022 ఏప్రిల్ నుంచి 2023 జనవరి
ఔట్ పేషెంట్	3,54,218	4,22,728
ఇన్ పేషెంట్	1,60,934	1,54,691
ట్యూబెక్టమీ	2,676	2,608
మైనర్ సర్జరీలు	1,884	5,199
ఇతర సర్జరీలు	6,238	6,909
ప్రసవాలు	7,951	6,539
ల్యాబ్ పరీక్షలు	5,50,982	5,76,788
సిటీ స్కాన్	3,020	4,564
పోస్టుమార్టం	859	680

కార్పొరేట్ స్థాయి సేవలందిస్తున్నాం



ఖమ్మం జనరల్ ఆస్పత్రిలో కార్పొరేట్ స్థాయిలో వైద్య సేవలు మెరుగు పడ్డాయి. దీంతో వ్యాధిగ్రస్తుల తాకిడి పెరిగింది. గతంలో కంటే ఈ ఏడాది వారి సంఖ్య భారీగా పెరిగింది. ఆస్పత్రికి అనుసంధానంగా మెడికల్ కళాశాల ఏర్పాటు శుభ పరిణామం. మరి కొద్ది రోజుల్లో బోధన ప్రారంభమయ్యే అవకాశం ఉండడంతో వైద్యులు పెరిగి సేవలు మరింత మెరుగు పడనున్నాయి. చుట్టుపక్కల జిల్లాల్లో ఎక్కడా లేనివిధంగా ఖమ్మం ఆస్పత్రిలో వైద్య సేవలు అందుతుండడంతో ఎక్కువ మంది ఇటు ఆకర్షితులవుతున్నారు.
– డాక్టర్ బి.వెంకటేశ్వర్లు, ఆస్పత్రి సూపరింటెండెంట్

మెడికల్ కళాశాలతో..
సౌకర్యాలు మెరుగు పడుతుండటంతో ఆస్పత్రిలో వైద్య సేవలు పెరిగాయి. రెండేళ్ల నుంచి వ్యాధిగ్రస్తుల సంఖ్య అంతకంతకూ పెరుగుతూ వస్తోంది. ఇకపై పెద్దాస్పత్రి స్థాయి మరింత పెరిగే అవకాశం ఉంది. ఈ ఆస్పత్రికి అనుసంధానంగా ప్రభుత్వం మెడికల్ కళాశాల ఏర్పాటు చేసింది. ఇందుకోసం పాత కలెక్టరేట్, ఆర్అండ్‌బీ భవనాలను కేటాయించింది. ఈ యేడాది నుండే బోధన ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. మెడికల్ కళాశాలకు ఇప్పటికే ప్రిన్సిపాల్‌ను నియమించారు. దీనికి తోడు 24 మంది సీనియర్ రెసిడెంట్ వైద్యులను కూడా కేటాయించటంతో వారు వైద్య సేవల్లో పాలు పంచుకుంటున్నారు. త్వరలో మరింత మంది వైద్యులు వచ్చే అవకాశం ఉండడంతో ఖమ్మం ఆస్పత్రికి వచ్చే వారికి మెరుగైన వైద్య సేవలు అందే అవకాశం కలగనుంది. హైదరాబాద్ తర్వాత ఆ స్థాయిలో ప్రభుత్వ పరంగా ఖమ్మం ఆస్పత్రిలో వైద్య సౌకర్యాలు మెరుగు పడుతున్నాయి.



మెడికల్ కళాశాల ప్రవేశద్వారం

క్లుప్తంగా

అభయారణ్య అందాల వీక్షణ



జలాశయాన్ని వీక్షిస్తున్న పర్యాటకులు

పాల్వంచరూరల్: మండలంలోని కిన్నెరసానికి ఆదివారం జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో పర్యాటకులు తరలివచ్చారు. డీర్ పార్కులోని దుప్పులను, డ్యామ్ పైనుంచి జలాశయాన్ని వీక్షించారు. 517 మంది పర్యాటకులు తరలిరాగా తద్వారా వైల్డ్‌లైఫ్‌శాఖకు రూ.18,200.. 200 మంది బోటు షికారు చేయడం ద్వారా టూరిజం కార్పొరేషన్‌కు రూ.11,910 ఆదాయం లభించిందని నిర్వాహకులు తెలిపారు.

రాధాకృష్ణకు బెస్ట్ ప్రెసిడెంట్ అవార్డ్



అవార్డు అందుకుంటున్న దండా రాధాకృష్ణ

మణుగూరురూరల్: మణుగూరు లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు దండా రాధాకృష్ణ బెస్ట్ ప్రెసిడెంట్ అవార్డు అందుకున్నాడు. ఆదివారం మండలంలోని బంగ్లాస్ ఏరియా ఇల్లెందు క్లబ్‌లో నిర్వహించిన లయన్స్‌క్లబ్‌ల ఇంటర్నేషనల్ రీజియన్ మీట్‌లో అవార్డును క్లబ్ పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్, మల్లిపుల్ పోరెడ్డి గోపాల్‌రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడారు. లయన్స్ క్లబ్ మణుగూరు వ్యవస్థాపకులు హరిబాబు సలహాలు, సూచనలతో సేవా కార్యక్రమాల్లో ముందుకు సాగుతున్నానన్నారు. కార్యక్రమంలో ఎంజేఎఫ్ లయన్ రీజియన్ చైర్‌పర్సన్ గంటా రమేశ్‌బాబు, సభ్యులు హరిబాబు, చంద్రమోహన్, తొమ్మిది క్లబ్‌ల సభ్యులు, జిల్లా లీడర్లు తదితరులు పాల్గొన్నారు.

క్షుద్రపూజల కలకలం

దమ్మపేట: మండలంలోని మల్కారం గ్రామంలో రోడ్డుపై ప్లేటులో ఉంచిన బియ్యం, ఉప్పు, రక్తం, కుంకుమ, నిమ్మకాయలను చూసి స్థానిక ప్రజలు భయాందోళనకు గురయ్యారు. మల్కారం నుంచి గొల్లగూడెం గ్రామానికి వెళ్లే మలుపులో రోడ్డుపై ఉంచిన సామగ్రిని ఆదివారం తెల్లవారుజామున గమనించిన స్థానికులు.. క్షుద్రపూజలు చేసినట్లుగా భావించారు. దీంతో గ్రామంలో క్షుద్ర పూజలు జరిగాయనే విషయం దావానలంలా వ్యాపించడంతో కలకలం రేగింది. ఇలాంటి చర్యలకు పాల్పడేవారిపై తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

మాజీ సర్పంచ్‌ను హతమార్చిన మావోయిస్టులు



మాజీ సర్పంచ్ మృతదేహం

చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని దంతెవాడ జిల్లాలో మావోయిస్టులు బీజేపీకి చెందిన మాజీ సర్పంచ్‌ను హతమార్చారు. వివరాలిలా ఉన్నాయి.. దంతెవాడ జిల్లా బార్సూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని హెట్మెట్లా గ్రామానికి చెందిన బీజేపీ నాయకుడు, మాజీ సర్పంచ్ రాందార్ అలామీ (50) తన గ్రామం నుంచి వేరే గ్రామానికి పనిమీద వెళ్లగా అక్కడి నుంచి అపహరించిన మావోయిస్టులు హతమార్చి మృతదేహాన్ని గ్రామ సమీపంలో పడేశారు. మాజీ సర్పంచ్‌ను తామే హతమార్చామంటూ తూర్పు బస్తర్ డివిజన్ కమిటీ మృతదేహం వద్ద ఒక లేఖను వదలింది.

అదుపుతప్పి బైక్ పైనుంచి పడిన యువకులు

పాల్వంచ: అతి వేగంతో నడుపుతున్న ద్విచక్ర వాహనం అదుపుతప్పి కింద పడటంతో ముగ్గురు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. ఆదివారం సాయంత్రం పట్టణ పరిధిలోని కుంటినాగుల గూడెం సమీపంలో మోటార్ సైకిల్‌పై వస్తూ అదుపుతప్పి కిందపడిపోయారు. బైక్‌పై ఉన్న పాత కొత్తగూడెం పెనుబల్లి గ్రామానికి చెందిన కోరం పెద్దిరాజు, కోరం రాజు, మట్ట కృష్ణకు తీవ్ర గాయాలయ్యాయి. అటుగా వెళ్తున్న ప్రజాపంథా నాయకులు నిమ్మల రాంబాబు వారిని ఆటోలో ఎక్కించి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

యువకుడి ఆత్మహత్య

నేలకొండపల్లి: ఉరివేసుకుని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం మండలంలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. మండలంలోని రాజేశ్వరపురం గ్రామానికి చెందిన డి.నాగప్రభ (22) అనుమానస్పద స్థితిలో ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆదివారం తెల్లవారుజామున స్థానికులు మృతదేహాన్ని గుర్తించారు. మూడు రోజుల కిందట ఉరి వేసుకుని ఉంటాడని తెలుస్తోంది. తన మనవడి ఆత్మహత్యపై పలు అనుమానాలు ఉన్నాయని అమ్మమ్మ గాలి రాజ్యం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అన్ని కోణాల్లోనూ విచారణ చేపట్టాలని ఆమె కోరింది. కాగా, ఘటనా స్థలానికి ఎస్ఐ స్రవంతి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని ఖమ్మం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అందరూ వెళ్లాల్సిందే...

- సమీకృత మార్కెట్‌కు వీధి వ్యాపారుల తరలింపు
- డీఆర్ఎఫ్ సిబ్బందితో ప్రత్యేక డ్రైవ్
- మైక్‌ల ద్వారా నగరంలో ప్రచారం



చేపల వ్యాపారులను సమీకృత మార్కెట్‌కు వెళ్లాలని సూచిస్తున్న డీఆర్ఎఫ్ సిబ్బంది

ఖమ్మంమయూరిసెంటర్: జిల్లా కేంద్రంలో నూతనంగా నిర్మించిన సమీకృత వెజ్ అండ్ నాన్-వెజ్ మార్కెట్‌పై ఖమ్మం కార్పొరేషన్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. నగరంలోని రోడ్ల వెంట పండ్లు, కూరగాయలు, మాంసం విక్రయించే వీధి వ్యాపారులందరినీ సమీకృత మార్కెట్‌కు తరలించేలా చర్యలు చేపడుతున్నారు. ఇప్పటికే ఇల్లెందు క్రాస్ రోడ్డులో ఉన్న రైతుబజార్‌లోని వ్యాపారులను, రైతులను సమీకృత మార్కెట్‌కు తరలించి స్టాళ్లు కేటాయించగా.. మిగతా వీధి వ్యాపారులను ఇక్కడకు చేర్చేలా చూస్తున్నారు. డీఆర్ఎఫ్ సిబ్బందితో ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తూ రోడ్ల వెంట వ్యాపారం చేసే వారిని గుర్తించి సమీకృత మార్కెట్‌కు తరలిస్తున్నారు. ట్రాఫిక్ సమస్యలు, ఇతర ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని వ్యాపారులందరూ సమీకృత మార్కెట్‌కు వెళ్లాలని కేఎంసీ అధికారులు చెబుతున్నారు. ఇదే సమయాన ప్రజలు సమీకృత మార్కెట్‌ను వినియోగించుకోవాలని అవగాహన కల్పిస్తున్నారు.

ప్రత్యేక డ్రైవ్..

ఇప్పటికే నగరంలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వీధి వ్యాపారుల ప్రాంగణాలకు వీధి వ్యాపారులను తరలించగా.. మిగిలిన వారితో పాటు రోడ్ల వెంట వ్యాపారాలు చేస్తున్న వారిని సమీకృత మార్కెట్‌కు తరలించాలని కేఎంసీ అధికారులు లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. ఈ మేరకు డీఆర్ఎఫ్ సిబ్బందితో కలిసి వీధి వ్యాపారులకు అవగాహన కల్పిస్తున్నారు. రోడ్ల వెంట పండ్లు, చేపలు, మాంసం అమ్మేవారిపై సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించారు. ప్రధాన రహదారుల వెంట ఉన్న వారిని గుర్తించి, వెంటనే వారిని మార్కెట్‌కు తరలించే ప్రయత్నం చేస్తున్నారు. మార్కెట్‌కు వెళ్తే వ్యాపారం తగ్గిపోతుందనే ఆందోళన చెందేవారికి అవగాహన కల్పిస్తున్నారు. గత రెండు రోజులుగా నగరంలోని గట్టయ్యసెంటర్, ఇల్లెందు క్రాస్‌రోడ్డు, సరితా క్లినిక్ సెంటర్, వైరా రోడ్డు, బైపాస్‌రోడ్డు, బస్‌డిపో రోడ్డు ప్రాంతాల్లో రోడ్డు పక్కన ఉన్న వ్యాపారులను సమీకృత మార్కెట్‌కు వెళ్లి అక్కడ వ్యాపారాలు నిర్వహించుకోవాలని సూచిస్తున్నారు.

ప్రజలకు అవగాహన..

ప్రజలు కూడా సమీకృత మార్కెట్‌లో ఏర్పాటు చేసిన స్టాళ్లలో అవసరమైన పండ్లు, కూరగాయలు, మాంసం కొనుగోలు చేయాలని సూచిస్తున్నారు. ఇప్పటికే టూటౌన్ పోలీస్ స్టేషన్ పక్కన ఉన్న కూరగాయల మార్కెట్‌ను వీడీవోస్ కాలనీలోని సమీకృత మార్కెట్‌కు తరలించామని, అక్కడే తాజా పండ్లు, కూరగాయలు, మాంసం, చేపలు, చికెన్ అన్నీ విడివిడిగా లభిస్తాయని కేఎంసీ కమిషనర్ పేరుతో ఆటోకు ఏర్పాటు చేసిన మైకుల ద్వారా ప్రచారం నిర్వహిస్తున్నారు. ఇదే సమయాన సమీకృత మార్కెట్‌లో వ్యాపారం సజావుగా సాగడంపై కూడా అధికారులు దృష్టి సారించారు. తద్వారా నగరంలో ట్రాఫిక్ సమస్యకు చెక్ పెట్టొచ్చనేది అధికారుల ఆలోచనగా తెలుస్తోంది.



ఆటో ద్వారా మైకుల్లో ప్రచారం చేస్తున్న దృశ్యం

నిత్యావసరాలపై జీఎస్టీ ఉపసంహరించాలి

ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి తిరుపతి



మాట్లాడుతున్న జి.తిరుపతి

సింగరేణి(కొత్తగూడెం): నిత్యావసరాలపై విధిస్తున్న జీఎస్టీని ఉపసంహరించాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలది ప్రజావ్యతిరేక బడ్జెట్ అని, ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి జి.తిరుపతి పేర్కొన్నారు. ఆదివారం కొత్తగూడెం పట్టణంలోని టీచర్స్‌భవన్‌లో 'కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల బడ్జెట్‌లు – వివిధ వర్గాల ప్రజలపై ప్రభావం' అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. జిల్లా కన్వీనర్ కొండపల్లి అధ్యక్షత జరిగిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కరోనా విపత్తు వల్ల భారత ఆర్థిక వ్యవస్థ మందగించిందని, ప్రపంచమంతా ఆర్థిక సంక్షోభం తీవ్రమవుతున్న తరుణంలో ఈ బడ్జెట్ కొనుగోలు శక్తిని పెంచే విధంగా ఉండాలని, దేశీయ డిమాండ్ వృద్ధి రేటు పెంచే విధంగా ఉండాలని, ఆ పరిస్థితిని కల్పించటంలో ఈ బడ్జెట్ విఫలమైందని ఆరోపించారు. ఐదు కిలోల ఉచిత ఆహార ధాన్యాలతో పాటు ఐదు కిలోల సబ్సిడీ ఆహార ధాన్యాలను అందించాలని కోరారు. ఆహారం, ఔషధాలతోపాటు నిత్యావసర వస్తువులపై జీఎస్టీ ఉపసంహరించుకోవాలని కోరారు. కార్యాలయంలో రాష్ట్ర నాయకులు ప్రసాద్, ఐలు జిల్లా కార్యదర్శి రమేశ్‌కుమార్‌మక్కడ్, ఎల్ఐసీ నాయకులు శ్రీనివాసన్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి అన్నవరపు సత్యనారాయణ, ఐద్వా జిల్లా కార్యదర్శి మందలపు జ్యోతి, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి డి.వీరన్న, యూటీఫ్ జిల్లా కోశాధికారి ఎస్.వెంకటేశ్వర్లు, డీవైఎఫ్ఐ అధ్యక్షులు లిక్కి బాలరాజు, కాళంగి హరికృష్ణ, భూక్యా రమేశ్, బుర్రా వీరభద్రం, కూరపాటి సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

బాబోయ్ దొంగలు..

- ఖమ్మంలో కలకలం సృష్టిస్తున్న చోరీలు
- ఏకంగా డీఎస్పీ ఇంట్లోనే సొత్తు అపహరణ



ఖమ్మంక్రైం: నగరంలో కొంతకాలంగా దొంగలు స్వైరవిహారం చేస్తున్నారు. పోలీసులు పెట్రోలింగ్ విషయాన్ని మరిచిపోవడంతో దొంగలు ఇళ్లల్లో పడి చోరీలకు పాల్పడుతున్నారు. ఇప్పుడు ఏకంగా నగరంలో నివాసం ఉంటున్న డీఎస్పీ ఇంట్లోనే చోరీకి పాల్పడిన ఘటన పోలీస్‌శాఖ వైఫల్యాన్ని బయటపెట్టిందనే విమర్శలు వినపడుతున్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో డీఎస్పీగా పనిచేస్తున్న ఆయన.. ఖమ్మంలో నివాసముంటున్నారు. ఆయన కుటుంబ సభ్యులు ఓ కార్యక్రమానికి ఊరికి వెళ్లారు. తిరిగి ఖమ్మం వచ్చి చూస్తే ఇంటితాళం పగులకొట్టి ఉంది. ఇంట్లోకి వెళ్లి చూసిన వారికి ఇంట్లో ఉన్న నగదు, బంగారు నగలు చోరీకి గురైనట్లు తేలడంతో టూటౌన్ పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే టూటౌన్ పోలీసులు, సీసీఎస్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ఆధారాలు సేకరించారు.

కూత వేటు దూరంలో..

వీడీవోస్ కాలనీలో ఉన్న డీఎస్పీ ఇల్లు ఖమ్మం టూటౌన్, ఏసీపీ కార్యాలయానికి కూత వేటుదూరంలో ఉంది. అయినా కూడా దొంగలు తమ పని సులువుగా కానిచ్చారంటే ఆ ప్రాంతంలో కనీసం పెట్రోలింగ్ లేదనే విమర్శలు వినపడుతున్నాయి. కొంతకాలంగా ఖమ్మం నగరంలోని అన్ని పోలీస్ స్టేషన్‌ల పరిధిలో చోరీల ఘటనలు తరచుగా వెలుగుచూస్తున్నాయి. ఇతర జిల్లాల నుంచి పలువురు అపరిచిత వ్యక్తులు నగరంలో సంచరిస్తున్నా పోలీసులు వారిపై నిఘా పెట్టడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సీసీఎస్ పోలీసులు గతంలో దొంగల కదలికలపై నిఘా పెట్టేవారు. ప్రస్తుతం వారిపై నిఘా కరువైందని, తద్వారా చోరీలు ఎక్కువగా జరుగుతున్నాయని తెలుస్తోంది. ఏదిఏమైనా ఇప్పటికైనా నగరంలో దొంగతనాలు అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. నిత్యం బందోబస్తులతో పోలీస్ సిబ్బంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోందని, దీంతోనే పెట్రోలింగ్ చేపట్టడం కష్టమవుతోందని సమాచారం.

విద్యాసంస్థల్లో 'కంటివెలుగు' నిర్వహించండి..

పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు రామకృష్ణ, ఆజాద్



మాట్లాడుతున్న ఆజాద్

ఖమ్మంమయూరిసెంటర్: కంటి చూపు సమస్యతో ఎవరికీ చెప్పలేక ఇబ్బంది పడుతున్న విద్యార్థులకు ప్రభుత్వం చొరవ తీసుకొని కంటి పరీక్షలు నిర్వహించాలని, అన్ని విద్యాసంస్థలలో కంటివెలుగు కార్యక్రమం ఏర్పాటు చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పి.రామకృష్ణ, నామాల ఆజాద్ డిమాండ్ చేశారు. ఆదివారం ఖమ్మంలోని రామనరసయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన సంఘం జిల్లా కమిటీ సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. రాష్ట్రీయ బాల స్వస్థ్య కార్యక్రమం (ఆర్బీఎస్) ద్వారా గతంలో పాఠశాలల్లో విద్యార్థులకు సాధారణ కంటి పరీక్షలు నిర్వహించేవారని, ఇప్పుడు ఆ పరిస్థితి లేదని, కంటివెలుగు శిబిరాలకు పాఠశాలలు, ఇంటర్ కళాశాలల విద్యార్థులను అనుమతించక పోవడం సరికాదని పేర్కొన్నారు. కంటి వెలుగు కార్యక్రమాన్ని విద్యాసంస్థల్లో అనుమతిస్తే మరింత మందికి ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. పాఠశాల, ఇంటర్ కళాశాలల్లో బ్లాక్ బోర్డుపై అక్షరాలు కనిపించని బాలబాలికలు 10–20 శాతం మంది చొప్పున ఉంటున్నారని, పాఠశాలస్థాయిలో గతంలోనే 4,900 మందికి దృష్టిలోపం ఉన్నట్లు అధికారులు గుర్తించారని, కోవిడ్ తర్వాత ఈ సంఖ్య మరింత పెరిగిందని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు చెబుతున్నా ప్రభుత్వం ఆ వైపు అడుగులు పడడం లేదని ఆరోపించారు. పోషకాహార లోపం వల్ల అధిక మంది గిరిజన విద్యార్థులు కంటి సమస్యతో బాధపడుతున్నారని, ప్రైవేట్‌గా పరీక్షలు చేయించుకుని కళ్లద్దాలు తీసుకునేందుకు ఒక్కొక్కరికి రూ.2,500 వరకు ఖర్చవుతుందని చెప్పారు. విద్యార్థుల సంఖ్యను బట్టి ఆయా విద్యాలయాలకు సమయం కేటాయించి, అధికారికంగా విద్యార్థులందరికీ పరీక్షలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్, జిల్లా ఉపాధ్యక్షులు దీపిక, కిరణ్, లక్ష్మణ్, సతీశ్, కరుణ్, శివ తదితరులు పాల్గొన్నారు.

మందుపాతరను నిర్వీర్యం చేసిన బలగాలు



నిర్వీర్యం చేసిన మందుపాతర

చర్ల: సరిహద్దు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లాలో ఆదివారం సీఆర్‌పీఎఫ్ బలగాలు శక్తివంతమైన మందుపాతరను గుర్తించి నిర్వీర్యం చేశారు. రహదారుల తనిఖీలకు వచ్చే పోలీసులను మట్టుబెట్టాలన్న లక్ష్యంతో బీజాపూర్ జిల్లాలోని ఆవుపల్లి–ఊసూరు ప్రధాన రహదారిలో మావోయిస్టులు సుమారు 3 కిలోల బరువు గల మందుపాతరను ఏర్పాటు చేశారు. తనిఖీ చేస్తూ ఆ ప్రాంతానికి వచ్చిన సీతాపూర్‌లోని సీఆర్‌పీఎఫ్ 196 బెటాలియన్‌కు చెందిన బలగాలు దీనిని గుర్తించారు. బీజాపూర్ పోలీస్ ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వడంతో అక్కడకు చేరుకున్న బాంబ్ డిస్పోజబుల్ టీం సభ్యులు దానిని నిర్వీర్యం చేశారు.

గంజాయి తరలిస్తున్న నలుగురు అరెస్ట్

జూలూరుపాడు: నిషేధిత గంజాయితో పట్టుబడిన నలుగురు యువకులను అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలిస్తున్నట్లు జూలూరుపాడు సీఐ వసంతకుమార్ ఆదివారం తెలిపారు. ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ వివరాలు వెల్లడించారు. స్థానిక పోలీస్‌స్టేషన్ సమీపంలో హెడ్‌కానిస్టేబుల్ శివాజీగణేశ్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టారు. సూర్యాపేట జిల్లా కోదాడ పరిసర ప్రాంతాలకు చెందిన నలుగురు యువకులు బైక్‌లపై నిషేధిత గంజాయిని అక్రమంగా తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. నింధితులు ఎస్కే సుబానీ పాషా, ముదియాల వీరసాయిరెడ్డి, కొండా వేణు, బొజ్జా అఖిల్‌కుమార్ వద్ద నుంచి 9 కేజీల గంజాయి, రెండు బైక్‌లు, మూడు సెల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. నలుగురు యువకులపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలిస్తున్నట్లు ఆయన చెప్పారు. గంజాయి తరలిస్తున్న యువకులను పట్టుకున్న హెడ్‌కానిస్టేబుల్ శివాజీగణేశ్, కానిస్టేబుళ్లు రవి, వెంకటేశ్వరరావు, సూర్యంలను సీఐ అభినందించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ తిరుపతిరావు, హెడ్‌కానిస్టేబుల్ బుచ్చయ్య, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న సీఐ వసంతకుమార్

మద్యం మత్తులో క్షణికావేశం

- మిత్రుడిపై పెట్రోల్ పోసి నిప్పంటించిన వైనం
- పరిస్థితి విషమం.. వరంగల్ ఎంజీఎంకు తరలింపు



తీవ్రంగా గాయపడిన ధనుష్‌కుమార్

ఖమ్మంక్రైం : ఇద్దరు స్నేహితుల మధ్య జరిగిన చిన్న ఘర్షణ చినికిచినికి గాలి వానలా మారి, క్షణికావేశంలో మిత్రుడిపై పెట్రోల్ పోసి నిప్పంటించిన ఘటన ఆదివారం తెల్లవారుజామున ఖమ్మంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ఖమ్మం జలగం నగర్‌కు చెందిన కొమ్ము ధనుష్‌కుమార్, ఫయాజ్ మిత్రులు. ధనుష్ కార్పెంటర్‌గా, ఫయాజ్ పెయింటర్‌గా పని చేస్తున్నారు. నిత్యం ఇద్దరూ కలిసి మద్యం తాగి రాత్రివేళ జులాయిగా తిరుగుతుంటారు. ఈ క్రమంలో శనివారం అర్ధరాత్రి, తిరిగి ఆదివారం తెల్లవారుజామున ధనుష్ బైక్‌పై ఖమ్మం పాత బస్టాండ్ సెంటర్‌కు వచ్చారు. కాసేపటి తర్వాత ఇంటికి వెళదామని ధనుష్ చెప్పగా.. వాహనంలో పెట్రోల్ పోయించిన ఫయాజ్ ఇంకాసేపు తిరుగుదామని అన్నాడు. దీనికి ధనుష్ ఒప్పుకోకపోవడంతో తాను పోయించిన పెట్రోల్ తిరిగి ఇవ్వాలని ఫయాజ్ అన్నాడు. దీంతో బైక్‌లో నుంచి పెట్రోల్ తీసి ఆ బాటిల్‌ను ఫయాజ్‌కు ఇచ్చాడు. ఆ తర్వాత ఇద్దరి మధ్య మళ్లీ తీవ్రంగా ఘర్షణ జరిగింది. దీంతో క్షణికావేశానికి లోనైన ఫయాజ్ ధనుష్‌పై పెట్రోల్ పోసి అగ్గిపుల్ల వెలిగించి అతడిపై వేశాడు. ఆ మంటలు తాళలేని ధనుష్ రోడ్డుపై పడి అటూ ఇటూ దొర్లాడు. మంటలు ఆగిపోయాక బైక్‌పై ఇంటికి వెళ్లాడు. అతడి పరిస్థితి చూసిన కుటుంబసభ్యులు వెంటనే జిల్లా కేంద్ర ఆస్పత్రికి తీసుకెళ్లగా, పరిస్థితి విషమించడంతో వరంగల్ ఎంజీఎంకు తరలించారు. హత్యాయత్నానికి పాల్పడిన ఫయాజ్‌ను వనటౌన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బాధితుడి తండ్రి శంకర్ ఫిర్యాదు మేరకు సీఐ చిట్టిబాబు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

లారీ కిందపడి వ్యక్తి మృతి

- బిడ్డ బారసాల ఉందనగా తండ్రి మృతి
- ఆ ఇంట్లో తీవ్ర విషాదం



ప్రసాద్ (ఫైల్)



ట్రాక్టర్‌ను ఢీకొట్టిన లారీ

అశ్వారావుపేటరూరల్: బిడ్డ బారసాల కార్యక్రమానికి ఒక రోజు ముందే తండ్రి రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలైన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. సోమవారం నిర్వహించాల్సిన బారసాల కార్యక్రమానికి తన తల్లిని తీసుకొని వెళ్లాల్సి ఉండగా, పత్తి బస్తాలను దించే కూలీ పనికి వెళ్లి రోడ్డు ప్రమాదంలో మృత్యువాతకు గురయ్యాడు. ఏపీలోని ఏలూరు జిల్లా కుక్కునూరు మండలం కొండపల్లి గ్రామానికి చెందిన పేరాల ప్రసాద్ (25)కు తల్లిదండ్రులతోపాటు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. కూలి పనులు చేసుకొని జీవనం సాగించే ప్రసాద్ తోటి కూలీలతో కలిసి ఓ రైతుకు సంబంధించిన పత్తి బస్తాలను ట్రాక్టర్‌లోడు చేసి, ఇదే ట్రాక్టర్ ఇంజన్ వద్ద కుర్చొని వ్యాపారికి విక్రయించేందుకు తీసుకొస్తున్నారు. ఈ క్రమంలో అశ్వారావుపేట మండలం ఊట్లపల్లి–తిమ్మాపురం గ్రామాల సమీపంలోకి వచ్చే సరికి స్పీడ్ బ్రేకర్లను డ్రైవర్ దాటించే క్రమంలో బ్రేక్ వేయగా, ఇదే సమయంలో ఒడిశా నుంచి ఏపీలోని కాకినాడ పోర్టుకు గ్రానైట్ రాళ్ల లోడుతో వెళ్తున్న లారీ వెనుక నుంచి దూసుకొచ్చి ట్రాక్టర్‌ను ఢీకొట్టింది. దాంతో పత్తి బస్తాలపై కుర్చొని ఉన్న ప్రసాద్ అదుపుతప్పి కింద పడగా, ఇతనిపై నుంచి లారీ దూసుకెళ్లింది. దీంతో ప్రసాద్ శరీరం రెండు ముక్కలై అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ఈ ఘటనపై తండ్రి శంకు చేసిన లిఖిత పూర్వక ఫిర్యాదుపై ప్రమాదానికి కారణమైన లారీడ్రైవర్ నాగఫణేంద్రకుమార్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజేశ్‌కుమార్ తెలిపారు. మృతదేహాన్ని శవ పంచనామా కోసం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

'బారసాల'ఫంక్షన్‌కు వెళ్లాలని చెప్పి..

తన చిన్న కుమార్తె బారసాల ఫంక్షన్ సోమవారం అల్లూరి సీతారామరాజు జిల్లా యటపాక మండలం గన్నవరంలోగల అత్తారింట్లో జరగనున్నది. ఈ శుభ కార్యక్రమానికి ప్రసాద్‌తోపాటు అతని తల్లి వెళ్లాల్సి ఉంది. కొద్ది సేపట్లో బయలుదేరి వెళ్లాల్సిండగా, ఇంతలోనే కూలి పని ఉందని, మధ్యాహ్నానికి తిరిగి వస్తానని చెప్పి పత్తి బస్తాలను లోడు చేసేందుకు వెళ్లాడు. గంటల వ్యవధిలోనే లారీ ఢీకొట్టిన ప్రమాదంలో ప్రసాద్ మృత్యువాత పడ్డాడు. విషయం తెలుసుకున్న ప్రసాద్ తల్లి కన్నీరు మున్నీరుగా విలపిస్తోంది. తెల్లవారితే బిడ్డ ఫంక్షన్ జరగాల్సిన ఇంట ఈ ఘటన తీరని విషాదాన్ని నింపింది.

కిన్నెరసాని కాల్వలో పడి యువకుడు..



మురళీకృష్ణ మృతదేహం

పాల్వంచ: కిన్నెరసాని నుంచి కేటీపీఎస్‌కు నీటి సరఫరా అయ్యే కాల్వలో ఈతకు వెళ్లి యువకుడు మృతి చెందాడు ఈ ఘటన ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పట్టణంలోని గట్టాయిగూడెం నందు వెల్డింగ్ పనులు చేస్తూ జీవనం సాగించే వేములపల్లి వెంకటసుబ్బారావు కుమారుడు మురళీకృష్ణ (35) తన స్నేహితులతో కలిసి ఆదివారం గాజులగూడెం సమీపంలో కిన్నెరసాని కాల్వకు ఈతకు వెళ్లాడు. మురళీకృష్ణకు ఈత వచ్చినప్పటికీ ప్రమాదవశాత్తు నీళ్లలో మునిగి మృతి చెందాడు. స్నేహితుడు మృతి చెందడంతో తోటి స్నేహితులు సైతం కంగారు పడి స్థానికులకు సమాచారం అందించి ఒడ్డుకు చేర్చి అక్కడి నుంచి వెళ్లిపోయారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని, సామాజిక మాధ్యమాల్లో మృతుడి ఆచూకీ కోసం ఫొటోలు పెట్టారు. దీంతో మురళీకృష్ణగా గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. మృతుడు అవివాహితుడు కాగా, ఒక సోదరి ఉంది. మురళీకృష్ణ మృతి ఆ ఇంట్లో తీరనిశోకాన్ని మిగిల్చింది.

చికిత్స పొందుతున్న వ్యక్తి..

అశ్వారావుపేటరూరల్: పురుగులమందు సేవించిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. స్థానిక ఎస్ఐ రాజేశ్‌కుమార్ కథనం ప్రకారం.. ఏపీలోని తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రిలోని అంబాజీపేటకు చెందిన పల్లె సత్యం (42) కూలి పనుల కోసం సుమారు రెండు నెలల కిందట అశ్వారావుపేటకు వచ్చి భార్యతో కలిసి ఉంటున్నాడు. కాగా ఆర్థిక ఇబ్బందుల కారణంగా మనస్తాపం చెంది శనివారం రాత్రి ఇంట్లోనే పురుగులమందు సేవించాడు. గమనించిన భార్య, స్థానికులు కలిసి అశ్వారావుపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా వైద్యులు చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం రాజమండ్రి ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతుండగానే పరిస్థితి విషమించి మృతి చెందాడు. దీనిపై భార్య తులసి చేసిన లిఖిత పూర్వక ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

క్లుప్తంగా...

'కొత్తపల్లె' కరెంటు బిల్లు.. రూ. 11.41 కోట్లు!

• కొత్త పంచాయతీకి విద్యుత్ షాక్



మాచారెడ్డి: ఇటీవల పంచాయతీల పునర్విభజనలో కొత్త పంచాయతీగా ఏర్పడిన కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలంలోని కొత్తపల్లె పంచాయతి భవనానికి రూ. కోట్లలో వచ్చిన కరెంటు బిల్లును చూసి ప్రజలు షాక్ అవుతున్నారు. పంచాయతీ వాటర్ వర్క్సకు సంబంధించిన సర్వీస్ నంబర్ 3801-02321పై ఈనెల 3న ట్రాన్స్‌కో బిల్లింగ్ సిబ్బంది మీటర్ రీడింగ్ నమోదు చేశారు. జనవరి 2 నుంచి ఫిబ్రవరి 3 వరకు 1,88,15,257 యూనిట్లు వాడినట్టు పేర్కొన్నారు. దీనికి ఏకంగా రూ. 11,41,63,672 బిల్లు విధించారు. ఏసీడీ డ్యూ కింద మరో రూ.8,716 వడ్డించారు. ఈనెల 17 లోపు బిల్లు చెల్లించాల్సి ఉందని పేర్కొన్నారు. ఈ బిల్లును చూసిన సర్పంచ్, పంచాయతీ సిబ్బంది షాక్‌కు గురయ్యారు. గతనెల విద్యుత్ బిల్లు రూ.3,257 వచ్చిందని సర్పంచ్ తెలిపారు. ఈ విషయాన్ని ట్రాన్స్‌కో అధికారుల దృష్టికి తీసుకువెళ్లగా సాంకేతిక సమస్యతో బిల్లు ఇలా వచ్చిందని చెప్పారు.

కరెంటు బిల్లు అంటూ దోచేస్తారు..

వినియోగదారులను అప్రమత్తం చేస్తున్న ఎన్పీడీసీఎల్

జనగామ: 'మీ విద్యుత్ బిల్లు పెండింగ్‌లో ఉంది.. చెల్లించకుంటే కరెంటు కట్ చేస్తాం'అంటూ అపరిచిత వ్యక్తులు వ్యాపార, వాణిజ్య, గృహ వినియోగదారుల వద్దకు వస్తున్నారని, వారిపట్ల అప్రమత్తతతో ఉండాలని ఎన్పీడీసీఎల్ అధికారులు జనగామలో ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. ఇందుకు సంబంధించి సీసీ పుటేజీల్లో రికార్డయిన సదరు వ్యక్తి ఫొటోను సైతం సంస్థ వాట్సాప్ గ్రూపుల్లో షేర్ చేస్తూ... వినియోగదారులను హెచ్చరిస్తున్నారు. అపరిచిత వ్యక్తులు వచ్చి కరెంటు బిల్లు కట్టాలని అడిగితే స్పందించవద్దని సూచిస్తున్నారు. సైబర్ నేరాలు.. ఓటీపీతో నగదు చోరీ.. ఇలా సాంకేతికతను ఆసరా చేసుకుని డబ్బులు స్వాహా చేస్తున్న నేరగాళ్లు.. ఇప్పుడు కొత్తగా కరెంటు బిల్లుల పేరిట ఊళ్లమీద పడటంతో ఎన్పీడీసీఎల్ సంస్థ ముందస్తుగా అప్రమత్తమైంది.

కొత్త గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌కు శుభాకాంక్షలు

ఏపీ సీఎం జగన్



సాక్షి, అమరావతి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్‌గా నియమితులైన జస్టిస్ అబ్దుల్ నజీర్‌కు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన మార్గనిర్దేశంలో రాష్ట్రం మరింత పురోగమిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. న్యాయ నిపుణులైన జస్టిస్ నజీర్ అనుభవం ప్రజాస్వామ్యాన్ని పరిపుష్టం చేయడంలో, రాష్ట్రానికి చక్కటి మార్గనిర్దేశం చేయడంలో ఉపయోగపడుతుందని ఆకాంక్షిస్తూ ఆదివారం ట్వీట్ చేశారు. ఇప్పటి దాకా రాష్ట్ర గవర్నర్‌గా వ్యవహరించిన విశ్వభూషణ్ హరిచందన్ ఛత్తీస్‌గఢ్ గవర్నర్‌గా నియమితులవ్వడం పట్ల శుభాకాంక్షలు తెలిపారు. గవర్నర్‌గా ఆయన రాష్ట్రానికి అందించిన సేవలను కొనియాడారు. రాష్ట్ర ప్రజలు ఆయన్ను ఎప్పటికీ గుర్తుంచుకుంటారని అన్నారు. మచ్చలేని వ్యక్తిత్వం హరిచందన్ సొంతమని పేర్కొన్నారు. కోవిడ్ లాంటి విపత్కర పరిస్థితులను దాటుకుని రాష్ట్రం ప్రగతి పథంలో పయనించడానికి ఆయన మరువలేని సహకారాన్ని అందించారని చెప్పారు. అధికార కార్యకలాపాల నిర్వహణలో ప్రజాస్వామ్య స్ఫూర్తి పరిఢవిల్లేలా, నిండైన హుందాతనంతో వ్యవహరించారని, అత్యుత్తమ రాజ కీయ పరిణతి చూపించారన్నారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల మధ్య సమన్వయంలో, వాటి మధ్య సంబంధాలు సజావుగా సాగడంలో అత్యంత కీలక పాత్ర పోషించి, రాజ్యాంగానికి వన్నె తెచ్చారన్నారని ముఖ్యమంత్రి జగన్ కొనియాడారు. తండ్రి తరహాలో వాత్సల్యాన్ని చూపారని, తెలుగు ప్రజలకు ఆత్మీయతను పంచారని ప్రశంసించారు. రాష్ట్రం నుంచి ఆయన వెళ్లిపోవడం బాధాకరమైనా, దేశంలో మరో రాష్ట్రానికి ఆయన గవర్నర్‌గా వెళ్లడం అక్కడి ప్రజలకు తప్పకుండా మేలు చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తూ ట్వీట్ చేశారు.

ఏపీ కొత్త గవర్నర్‌గా జస్టిస్ అబ్దుల్ నజీర్

▶ మొదటి పేజీ తరువాయి

గవర్నర్‌గా బాధ్యతలు నిర్వర్తించిన విషయం విదితమే. జస్టిస్ అబ్దుల్ నజీర్ కర్ణాటకలోని దక్షిణ కన్నడ జిల్లా బెళువాయికానాలో 1958 జనవరి 5న జన్మించారు. ఈ పట్టణం మంగళూరుకు 35 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. మూడబిద్రిలోని మహావీర్ కాలేజీలో బీకాం, మంగళూరులోని ఎస్‌డీఎం లా కాలేజీలో ఎల్‌ఎల్‌బీ పట్టా పొందారు. 1983లో కర్ణాటక హైకోర్టులో న్యాయవాద వృత్తిని ప్రారంభించారు. 2003 మే 12న కర్ణాటక హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. అనంతరం పూర్తి స్థాయి న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టాక 2017 ఫిబ్రవరిలో సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. మూడో స్థానంలో ఉన్న న్యాయమూర్తి ఏ హైకోర్టులోనూ ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టకుండా నేరుగా సుప్రీంకోర్టుకు పదోన్నతి పొందడం అదే తొలిసారి. 2023 జనవరి 4న సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదవీ విరమణ పొందారు. ఆ సందర్భంగా నిర్వహించిన అభినందన సభలో జస్టిస్ అబ్దుల్ నజీర్ గురించి సీజేఐ డీవై చంద్రచూడ్ మాట్లాడుతూ.. 'జస్టిస్ అబ్దుల్ నజీర్ సౌమ్యుడు, సామాన్యుడు. ఇటీవలి వరకు డ్రైవింగ్ లైసెన్స్ లేదా న్యాయమూర్తి కార్డును గుర్తింపు కార్డుగా ఉపయోగించారు. 2019లో పాస్‌పోర్టు తీసుకున్నారు. అదీ అత్యవసరంగా మాస్కో వెళ్లాల్సివచ్చినప్పుడు తీసుకున్నారు. పాస్‌పోర్టుపై తొలిస్టాంపు అదే' అని వ్యాఖ్యానించారు.

కీలక ధర్మాసనాల్లో బాధ్యతలు

జస్టిస్ అబ్దుల్ నజీర్ సుప్రీంకోర్టులో పలు కీలక ధర్మాసనాల్లో న్యాయమూర్తిగా పని చేశారు. 2017లో ట్రిపుల్ తలాక్ కేసులో ఏకైక ముస్లిం న్యాయమూర్తిగా ఉన్నారు. ఐదుగురు న్యాయమూర్తులున్న ఈ ధర్మాసనంలో ముస్లిం షరియా చట్టం ప్రకారం ట్రిపుల్ తలాక్ ఆచరణకు అనుమతి ఉందని జస్టిస్ నజీర్ తన తీర్పులో పేర్కొన్నారు. 3:2తో ట్రిపుల్ తలాక్ చెల్లదని ఆ ధర్మాసనం తీర్పు చెప్పిన విషయం విదితమే. 2019లో అయోధ్య రామ మందిరం కేసులోనూ రాజ్యాంగ ధర్మాసనంలో సభ్యుడిగా ఉన్నారు. వివాదాస్పద ప్రాంతంలో హిందూ నిర్మాణం ఉనికి గురించి ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా పేర్కొన్న విషయాన్ని జస్టిస్ నజీర్ సమర్థించారు. రామ మందిరానికి అనుకూలంగా తీర్పునిచ్చారు. పదవీ విరమణకు ముందు రాజ్యాంగ ధర్మాసనానికి నేతృత్వం వహించిన జస్టిస్ నజీర్ పెద్దనోట్ల రద్దు సహా పలు కేసులు విచారించారు.


ఆదివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అనుపమా చక్రవర్తి

భద్రాచలం పాదయాత్రకు భట్టి

సాక్షి, హైదరాబాద్: హాథ్‌సే హాథ్ జోడో యాత్రలో భాగంగా ఈనెల 14న భద్రాచలం నియోజకవర్గంలో జరిగే పాదయాత్రలో సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క పాల్గొంటారు. ఈనెల ఆరో తేదీ నుంచి ప్రారంభమైన టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ పాదయాత్ర 14న భద్రాచలం చేరుకుంటుందని టీపీసీసీ వర్గాలు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపాయి. 15 నుంచి వరంగల్ పార్లమెంటరీ నియోజక వర్గం పరిధిలో యాత్ర సాగుతుందని, 15న పాలకుర్తి, 16న వర్ధన్నపేట, 17న స్టేషన్ ఘన్‌పూర్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో జరిగే యాత్ర లో రేవంత్ పాల్గొంటారని పేర్కొన్నాయి.

టీడీపీ గూండాల బరితెగింపు


వడ్డాది రమణ

వించిపేట (విజయవాడ పశ్చిమ): ఏపీలో టీడీపీ నేతల అరాచకాలకు అంతులేకుండా పోయింది. తమ కుటుంబంలోని మహిళను ఎందుకు వేధించారని ప్రశ్నించిన పాపానికి విజయవాడలో టీడీపీ నేత ఒకరు ఏకంగా 20 మందికి పైగా అనుచరులతో కలిసి.. కత్తులతో ఆ మహిళ కుటుంబంపై విచక్షణ రహితంగా దాడి చేయడం ఆ పార్టీ దిగజారుడుతనానికి నిదర్శనంగా నిలిచింది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. విజయవాడ నగరంలోని 55వ డివిజన్ (వించిపేట) టీడీపీ అధ్యక్షుడు వడ్డాది రమణ తమ్ముడు వడ్డాది నరేశ్ నెల రోజులుగా ఓ వివాహితను లైంగిక వేధింపులకు గురి చేస్తున్నాడు. ఈ క్రమంలోనే ఆదివారం సాయంత్రం బయటకు వెళ్తున్న ఆమెపై చేతులు వేసి, అనుచిత వ్యాఖ్యలు చేశాడు. బాధితురాలు ఈ విషయాన్ని కుటుంబ సభ్యులకు చెప్పగా ఆమె అత్త, మామ, మరిది కలిసి టీడీపీ నాయకుడు వడ్డాది నరేశ్ ఇంటి వద్దకు వెళ్లారు. ఆ సమయంలో టీడీపీ నేతలు రమణ, నరేశ్ ఇంటి వద్ద లేరు. జరిగిన విషయాన్ని వారి కుటుంబ సభ్యులకు చెప్పి.. మరోసారి ఇలా జరిగితే పోలీసులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. బాధితులు తమ ఇంటి వద్దకు వచ్చి వెళ్లారనే విషయం తెలుసుకున్న టీడీపీ నేతలు వడ్డాది రమణ, నరేశ్.. 20 మంది అనుచరులతో కలిసి వివాహిత ఇంటిపైకి దాడికి వెళ్లారు. 'మా ఇంటికే వచ్చి హెచ్చరిస్తారా.. మీకెంత ధైర్యం.. ఇప్పుడు మీకు ఎవరు అడ్డువస్తారో చూస్తాం..' అని తిడుతూ వివాహిత మామ ఏడుకొండలు, అత్త భారతి, మరిది అరుణ్‌కుమార్‌తో పాటు మరో యువకుడు హేమంత్‌పై కత్తులతో దాడి చేశారు. అరుణ్‌కుమార్‌కు పొత్తి కడుపులో, మిగిలిన వారి ఒంటిపై పలు చోట్ల గాయాలయ్యాయి. స్థానికులు వారిని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. టూటౌన్ పోలీసులు వడ్డాది రమణ, వడ్డాది నరేశ్, మరో నలుగురిపై కేసు నమోదు చేశారు.


సీనియర్ పాత్రికేయుడు రామచంద్రమూర్తికి పురస్కారం అందజేస్తున్న జూలూరి గౌరీశంకర్. చిత్రంలో అల్లం నారాయణ, ఘంటా చక్రపాణి


కుప్పిలి పద్మకు పురస్కారం అందజేస్తున్న సాక్షి మీడియా గ్రూప్ ఎడిటర్ వర్ధెల్లి మురళి

లోపాలను ప్రశ్నించిన వ్యక్తి.. అరుణ్‌సాగర్

• విశిష్ట పురస్కారాల ప్రదాన సభలో వక్తలు
• సీనియర్ పాత్రికేయుడు రామచంద్ర మూర్తికి జీవన సాఫల్య పురస్కారం
• కుప్పిలి పద్మకు విశిష్ట సాహితీ పురస్కారం

భద్రాచలంటౌన్: ఎప్పుడైనా, ఎక్కడైనా తన అభిప్రాయాలను నిక్కచ్చిగా చెప్పి వ్యవస్థలోని లోపాలను ప్రశ్నించే తత్వం ఉన్న వ్యక్తి అరుణ్ సాగర్ అని పలువురు సీనియర్ పాత్రికేయులు చెప్పారు. అరుణ్‌సాగర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అరుణ్‌సాగర్ విశిష్ట పురస్కారాల ప్రదాన కార్యక్రమం ఆదివారం భద్రాచలంలో జరిగింది. మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయుడు కె.రామచంద్ర మూర్తికి జీవన సాఫల్య పురస్కారం, ప్రముఖ కవయిత్రి, రచయిత్రి కుప్పిలి పద్మకు విశిష్ట సాహితీ పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా అల్లం నారాయణ మాట్లాడుతూ.. మరణం తర్వాత జీవించి ఉన్న అరుదైన వ్యక్తుల్లో అరుణ్ సాగర్ ఒకరని, ఏడేళ్లుగా ఆయనను తలచుకుంటూనే ఉన్నామన్నారు. సీనియర్ జర్నలిస్టులకు గురువులాంటి వ్యక్తి రామచంద్రమూర్తిని అరుణ్‌సాగర్ అవార్డుతో సన్మానించుకోవడం గర్వంగా ఉందని చెప్పారు. ఆధునిక రచన, కవితా శైలికి కుప్పిలి పద్మ ఉదాహరణ అని పేర్కొన్నారు.

కవిత్వంలో తన తరం వాళ్లకంటే ముందే...

సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరి గౌరీశంకర్ మాట్లాడుతూ.. అల్లూరి, కొమురం భీమ్ తరహాలో గిరిజన ప్రాంతమైన భద్రాచలం నుంచి వచ్చిన అరుణ్‌సాగర్ నిర్వాసిత గిరిజనుల జీవితాన్ని తన రచనల్లో చూపారని చెప్పారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ.. ఎదిరించే తత్వం ఈ గడ్డ నుంచే మొదలైందని, ఆనాడు భక్త రామదాసు తానీషాను ఎదిరించి రాముడి గుడి నిర్మించాడని గుర్తుచేశారు. ఈ గడ్డపై పుట్టిన అరుణ్‌సాగర్‌ది కూడా ఎదిరించి నిలిచే తత్వమని గుర్తు చేసుకున్నారు. అనంతరం సాక్షి మీడియా గ్రూప్ ఎడిటర్ వర్ధెల్లి మురళి మాట్లాడుతూ.. తన తరం జర్నలిస్టుల్లో అరుణ్‌సాగర్ అత్యంత ప్రతిభావంతుడని, అదేవిధంగా కవిత్వంలో తన తరం వాళ్లకంటే ఎంతో ముందుండేవారని కొనియాడారు. తెలుగు పత్రికా రంగాన్ని ప్రజల పక్షం చేయడంలో ఏబీకే ప్రసాద్ తర్వాత పేర్కొనదగిన వ్యక్తి కె. రామచంద్రమూర్తి అని అన్నారు. సాహిత్య రంగానికి కుప్పిలి పద్మ ఎంతో సేవ చేశారని చెప్పారు. ఈ పురస్కారాన్ని స్వీకరిస్తున్న సందర్భంగా అరుణ్ సాగర్ జ్ఞాపకాలను మరోసారి గుర్తు తెచ్చుకున్నామని రామచంద్రమూర్తి అన్నారు. అరుణ్‌సాగర్ కవితలు తన తరం, ఆ తర్వాత వారికి దిశానిర్దేశం చేస్తాయని కుప్పిలి పద్మ చెప్పారు. కార్యక్రమంలో టీఎస్‌పీఎస్సీ మాజీ చైర్మన్ ఘంటా చక్రపాణి, ఎమ్మెల్సీ, కవి గోరటి వెంకన్న, సంపాదకుడు కె.శ్రీనివాస్, మువ్వా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేడు అంబేడ్కర్ వర్సిటీ బీఎడ్ స్పాట్ అడ్మిషన్లు

బంజారాహిల్స్ (హైదరాబాద్): బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం బీఎడ్ స్పెషల్ ఎడ్యుకేషన్ హెచ్ఐ కేటగిరీలో మిగిలిన సీట్ల కోసం స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నారు. సోమవారం ఉదయం 10 నుంచి 11 గంటల లోపు రిపోర్ట్ చేసిన వారిని పరిగణనలోకి తీసుకుంటామని విశ్వవిద్యాలయ వర్గాలు తెలిపాయి. ఇక్కడి పరిపాలన భవనంలో స్పాట్ అడ్మిషన్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు విద్యార్థి సేవల విభాగం ఇన్‌చార్జి డైరెక్టర్ ఎల్‌వీకే రెడ్డి వెల్లడించారు. ఆసక్తి గల అభ్యర్థులు స్పాట్ అడ్మిషన్‌కు కావాల్సిన అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు ఒక సెట్ జిరాక్స్ కాపీలు, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు తీసుకురావాలని సూచించారు. విశ్వవిద్యాలయం నిర్వహించిన ఎంట్రన్స్ పరీక్ష రాసి అందులో ర్యాంకు పొందిన అభ్యర్థులు మాత్రమే హాజరుకావాలని స్పష్టంచేశారు. ఇతర వివరాలకు వర్సిటీ వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు.

జిల్లా వార్తలు

పోరాటాలకు ఆదివాసీలు సిద్ధం కావాలి


మాట్లాడుతున్న ఆదివాసీ జేఏసీ నాయకులు

బయ్యారం: ఆదివాసీల అభివృద్ధిని పట్టించుకోని కేసీఆర్ ప్రభుత్వంపై పోరాడేందుకు ఆదివాసీలు సిద్ధం కావాలని ఆదివాసీ జేఏసీ రాష్ట్ర చైర్మన్ దాట్ల నాగేశ్వరరావు, రాష్ట్ర కన్వీనర్ ఈసం సుధాకర్ అన్నారు. ఆదివారం మహబూబాబాద్ జిల్లా బయ్యారంలో నిర్వహించిన జేఏసీ సమావేశంలో వారు మాట్లాడారు. ఏజెన్సీ ప్రాంతంలో నివసిస్తున్న ఆదివాసీలకు అడవిపై హక్కు లేదంటూ సీఎం కేసీఆర్ ప్రకటించడం సరికాదన్నారు. ప్రభుత్వాలు ఏర్పడక ముందే ఆదివాసీలకు అడవిపై హక్కులు ఉన్నాయన్నారు. ఆదివాసీల సమస్యలపై ఈనెల 24న గంగారం మండల కేంద్రం నుంచి కొత్తగూడ వరకు నిర్వహించనున్న మహా పాదయాత్రను జయప్రదం చేయాలన్నారు. సమావేశంలో నాయకులు వెంకటేశ్వర్లు, మధు, శంకర్, నరేష్, సారయ్య, శ్యామ్, సమ్మయ్య, పాపారావు, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

హజ్‌యాత్రకు మార్గదర్శకాలు విడుదల

ఖమ్మం మామిళ్లగూడెం : 2023 హజ్‌యాత్రకు మార్గదర్శకాలు విడుదలైనట్లు రాష్ట్ర హజ్ కమిటీ సభ్యులు షేక్ మగ్బూల్ ఆదివారం ఒక ప్రకటనతో తెలిపారు. ఇండియా హజ్ కమిటీ మార్గదర్శకాల ప్రకారం సోమవారం సాయంత్రం 4 గంటల నుంచి హైదరాబాద్ హజ్‌హౌస్‌లో దరఖాస్తుల స్వీకరిస్తారని, మార్చి 10 వరకు గడువు ఉందని పేర్కొన్నారు. ఆధార్ కార్డు, బ్యాంక్ పాస్‌బుక్, పాస్‌పోర్టు, ఓటరు గుర్తింపు కార్డు కలిగి ఉండాలని సూచించారు. ఈసారి 70 సంవత్సరాలు పైబడిన వారికి కూడా అవకాశం ఉందని తెలిపారు. మెడికల్ ఫిట్‌నెస్, కోవిడ్-19 వ్యాక్సినేషన్ సర్టిఫికెట్, పోలియో టీకా, ఆర్‌టీపీసీఆర్ పరీక్షలు చేయించుకోవాలని వివరించారు.

19న 'నెలనెలా వెన్నెల'

ఖమ్మంగాంధీచౌక్: అభ్యుదయ సాంస్కృతిక కదంబం నెలనెలా వెన్నెల 67వ కార్యక్రమం ఈనెల 19న ఖమ్మంలోని భక్తరామదాసు కళాక్షేత్రంలో నిర్వహిస్తున్నట్లు అన్నాబత్తుల రవీంద్రనాథ్ కళా సాంస్కృతిక సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు మోటమర్రి జగన్మోహన్‌రావు, ఏఎస్ కుమార్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం వారొక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా కేఎల్ నర్సింహారావు రచన, డాక్టర్ నిభానుపూడి సుబ్బరాజు దర్శకత్వంలో రూపొందించిన 'తొలకరి' నాటికను సుమిత్రా యూత్ అసోసియేషన్ మధిర కళాకారులు ప్రదర్శిస్తారని తెలిపారు.

'పట్టా' భాగ్యం దక్కేనా ?


పోడు వివాదం జరుగుతున్న యల్లన్ననగర్ గ్రామం


పోడు సర్వే జరపకుండా వివాదానికి కారణమైన భూమి

• యల్లన్ననగర్‌లో చేపట్టని పోడు భూముల సర్వే
• అధికారులు – గ్రామస్తుల మధ్య వివాదాలే కారణమా..
• పలు కేసులతో పాటు జైలుకు వెళ్లొచ్చినా కనిపించని ఫలితం

కొణిజర్ల: కొణిజర్ల మండలం గుబ్బగుర్తి పంచాయతీ శివారు గ్రామమైన యల్లన్ననగర్‌లో సుమారు 150 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. గత 30, 40 ఏళ్లుగా గుబ్బగుర్తి రిజర్వ్ ఫారెస్టులో పోడు నరికి భూములు సాగు చేసుకుంటూ అనేక గ్రామాల వాళ్లు వలస వచ్చి అడవికి దగ్గరలోనే గ్రామం నిర్మించుకుని ఉంటున్నారు. సాగర్ ప్రధాన కాల్వకు ఓ వైపు పోడు భూములు, మరో వైపు వీరు నివసించే గ్రామం ఉంది. పోడు భూములు సాగు చేసుకునే క్రమంలో అటవీ అధికారులకు – గ్రామస్తులకు మధ్య పలుమార్లు వివాదాలు జరిగాయి. రైతులు విత్తనాలు వేయడం, ఆ తర్వాత అధికారులు వచ్చి వాటిని తొలగించడం వంటి ఘటనలు సర్వసాధారణంగా మారాయి. అయితే 2008లో అప్పటి అటవీ శాఖ ఉన్నతాధికారులు గ్రామస్తులతో ఒప్పందానికి వచ్చి సుమారు 75 హెక్టార్ల భూమిని వారి నుంచి తీసుకుని ప్లాంటేషన్ చేశారు. మిగిలిన సుమారు 1000 ఎకరాల్లో రైతులు సాగు చేసుకుంటున్నారు. ఈ క్రమంలో కొంతమంది మళ్లీ అడవి మధ్యలో సుమారు 20 హెక్టార్లలో పోడు నరికి పత్తి సాగు చేయడం మొదలుపెట్టారు. దీంతో అటవీ అధికారులు వారిపై కేసులు పెట్టి పోలీసుల సాయంతో పంటలను ధ్వంసం చేయించారు. అప్పటి నుంచి అటవీ అధికారులకు గ్రామస్తులకు మధ్య ఘర్షణలు మళ్లీ మొదలయ్యాయి. 2021 ఆగస్టులో అటవీ అధికారుల విధులకు ఆటంకం కలిగించారని ఎఫ్ఆర్ఓ బి.రాధిక నేతృత్వంలో సుమారు 20 మందిపై కేసు పెట్టి అరెస్టు చేసి ఖమ్మం సబ్ జైలుకు తరలించారు. వీరిలో చంటి బిడ్డల తల్లులు కూడా ఉండటంతో రాష్ట్ర వ్యాప్తంగా సంచలనంగా మారింది. చంటి బిడ్డల తల్లులు జైలు నుంచి విడుదలైన తర్వాత పలు మానవ హక్కుల సంఘాల వారు, సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క, ములుగు ఎమ్మెల్యే సీతక్క, బీజేపీ నాయకులు ఇలా పలువురు వారిని పరామర్శించి పోడు భూములకు పట్టాలు ఇచ్చే వరకు పోరాడుతామని హామీ ఇచ్చారు. అయితే ఆ తర్వాత కూడా గ్రామస్తులు వ్యవసాయ పనులు మొదలు పెట్టినప్పుడల్లా అధికారులు అడ్డుకోవడం, ఘర్షణలు జరగడం పరిపాటైంది.


అసలు కథ ఇప్పుడే..

పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుని పోడు సాగుదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించింది. యల్లన్ననగర్‌లోనూ గిరిజనులు, గిరిజనేతరులు కలిపి 696 మంది 1612 ఎకరాల్లో సర్వే కోసం దరఖాస్తు చేసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా పోడు భూముల్లో సర్వే చేసిన అధికారులు యల్లన్ననగర్‌లో మాత్రం చేపట్టలేదు. దీంతో గుబ్బగుర్తి గ్రామస్తులు తిరిగి కొత్తగా పోడు నరికి తమకు కూడా పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని కొత్త వాదన లేవనెత్తారు. ఖమ్మం డీఎఫ్ఓ సిద్దార్థ్ విక్రమ్‌సింగ్ నేతృత్వంలో ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని అటవీ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని అడవిలో, గుబ్బగుర్తిలో కవాతు నిర్వహించారు. కొత్తగా అంగుళం భూమి కూడా ఆక్రమణకు గురి కానివ్వబోమని ప్రకటించారు. యల్లన్ననగర్‌లోనూ కొత్తగా పోడు సాగు చేస్తున్న 20 హెక్టార్ల భూమిని తమకు స్వాధీనం చేస్తే మొక్కలు నాటిన తర్వాత మిగతా సాగు భూమిని సర్వే చేస్తామని ఎఫ్ఆర్ఓ రాధిక చెప్పారు. గ్రామస్తులు ఒప్పుకోకపోవడంతో సమస్య మళ్లీ మొదటికొచ్చింది. గుబ్బగుర్తి వాసుల ఆందోళనను సాకుగా చూపి అధికారులు సర్వే నిలిపేశారు. దీంతో యల్లన్ననగర్ వాసులకు పోడు పట్టాలు వచ్చేది కలేనా అని పలువురు చర్చించుకుంటున్నారు.

గిరిజనేతరులు కాబట్టే సర్వే నిలిపేశాం

యల్లన్ననగర్‌లో పోడు సాగు చేస్తున్న వారంతా గిరిజనేతరులే. అదీకాక వారంతా 2005 తర్వాతే పోడు సాగు చేసకుంటున్నారు. అందుకే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పోడు సర్వే చేయలేదు. గిరిజనులు కూడా అతి కొద్దిమంది మాత్రమే ఉన్నారు. వారు కూడా ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారే. – బి.రామ, ఎఫ్ఎస్ఓ, కొణిజర్ల


పొలానికి కూడా పోనివ్వడం లేదు



పోడు చేసుకుంటున్న మమ్మలను పొలానికి కూడా పోనివ్వడం లేదు. అరకలు, ట్రాక్టర్లు ఆపేస్తున్నారు. పోడు భూముల సర్వే చేయమంటున్నారు. కనీసం గిరిజనులమైన మా భూములు సర్వే చేసి పట్టాలు ఇవ్వాలి. అధికారులు మాపై కనికరం చూపాలి.

– లావుడియా విజయ, యల్లన్ననగర్

జైలుకెళ్లి వచ్చినా ఫలితం దక్కదా



పోడు భూముల కోసం పోలీసులతో దెబ్బలు తిని జైలుకు పోయి వచ్చినా మాకు ఫలితం దక్కడం లేదు. అటవీ అధికారులు 20 హెక్టార్ల భూమి ఇస్తేనే సర్వే చేస్తామని చెబుతున్నారు. 40 ఏళ్లుగా ఈ భూమినే నమ్ముకుని బతుకుతున్నాం. సీఎం కేసీఆర్ స్పందించి తక్షణమే సర్వే చేయించాలి.

– గోగుల సోములు, గ్రామపెద్ద

'సెల్ఫీ విత్ రంగోలి' విజేతలకు బహుమతులు

కొత్తగూడెంరూరల్: జీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సంక్రాంతి సందర్భంగా నిర్వహించిన 'సెల్ఫీ విత్ రంగోలి' పోటీల విజేతలకు ట్రస్ట్ చైర్మన్, రాష్ట్ర వైద్యారోగ్య శాఖ డైరెక్టర్ గడల శ్రీనివాసరావు ఆదివారం బహుమతులు అందజేశారు. లక్ష్మీదేవిపల్లి మండలంలోని శ్రీనగర్ కాలనీలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ప్రతి మహిళ సంక్రాంతి పండగను కనులకు కట్టినట్టుగా ముగ్గులు వేశారని అభినందించారు. ప్రతి కార్యక్రమంలోనూ మహిళలకు చోటు కల్పిస్తూ వారు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేలా చేయూత అందిస్తానని తెలిపారు.


విజేతలతో డీహెచ్ గడల శ్రీనివాసరావు

ధ్యానం.. ఒక వరం

• ధ్యానంతో లక్ష్యాన్ని సాధించవచ్చు..
• సూర్యాపేట ఎస్పీ ఎస్.రాజేంద్రప్రసాద్
• జయ్యారంలో ధ్యాన మందిరం ఏర్పాటు


ధ్యానంపై అవగాహన కల్పిస్తున్న ఎస్పీ రాజేంద్రప్రసాద్, ఏసీపీ గిరిప్రసాద్


ఎస్పీ కుటుంబ సభ్యులకు ధ్యాన గురువు చిత్రపటాన్ని అందించి సన్మానిస్తున్న నిర్వాహకులు

చిన్నగూడూరు: జీవితంలో ఎన్నో ఒత్తిళ్లు, మరెన్నో సమస్యలకు లోనవుతున్న వారికి ప్రశాంత జీవితం, మానసిక ప్రశాంతత కోరుకునే వారికి ధ్యానం ఒక వరం లాంటిదని సూర్యాపేట ఎస్పీ ఎస్.రాజేంద్ర ప్రసాద్ అన్నారు. మహబూబాబాద్ జిల్లా చిన్నగూడూరు మండలం జయ్యారం గ్రామంలో నిర్మించిన శ్రీరామచంద్ర మిషన్ ధ్యాన మందిరాన్ని ఆదివారం కమలేష్ దాజీ పటేల్(పద్మ భూషణ్ అవార్డు గ్రహీత) హైదరాబాద్ నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు. ముఖ్యఅతిథులుగా సూర్యాపేట ఎస్పీ రాజేంద్రప్రసాద్, గోదావరిఖని ఏసీపీ గిరిప్రసాద్ హాజరై మాట్లాడారు. ఆధ్యాత్మికతతో ఉన్నత శిఖరాలను అందుకోవాలనే అభిలాషులకు తమ జీవితాలను తామే సరిదిద్దుకుని తమ విధిని తామే రూపొందించాలనుకునే వారికి ధ్యానమే ఒక శరణ్యమన్నారు. ఏకాగ్రత, జ్ఞాపకశక్తి, గ్రాహక శక్తి పెంపొందించుకోవడంలో ధ్యానం ఎంతగానో తోడ్పడుతుందన్నారు. ప్రతీ ఒక్కరికి ధ్యానం నేర్పించడమే ఆశయంగా పని చేస్తుందన్నారు. సమాజంలో అన్ని వర్గాల వారికి ఒత్తిడుల నుంచి మెరుగైన జీవితాన్ని అందించడమే దీని ముఖ్య ఉద్దేశమన్నారు. అందరికీ సులభంగా, ఆచరణీయంగా అందుబాటులో ఉంచాలనే ఒక మహా సంకల్పంతో రాజయోగ విధానాన్ని ఆధునీకరించారన్నారు. కమలేష్ దాజీ పటేల్ వారు రచించిన ది హార్ట్ ఫుల్‌నెస్ వే, డిజైనింగ్ డెస్టిని అనే పుస్తకాలు ఆధ్యాత్మిక రంగంలో విప్లవాన్ని సృష్టిస్తూ ఎందరికో మార్గదర్శనం చేస్తున్నాయన్నారు. వారు రచించిన విజ్‌డమ్ బ్రిడ్జ్ అనే మరో పుస్తకం గోల్డెన్ బుక్ ఆఫ్ రికార్డ్సులో స్థానం పొందిందని తెలిపారు. జయ్యారం గ్రామంలో మందిరం ఏర్పాటుకు 2018లో అవకాశం వచ్చిందన్నారు. ధ్యాన మందిర వ్యవస్థాపకులు, తన తండ్రి అయిన శేరి భిక్షమయ్య ఎంతో కృషి చేశారని తెలిపారు. విరాళాలతో కట్టిన మందిరం నిర్మాణానికి సుమారు రూ.25లక్షల వ్యయం అయినట్లు తెలిపారు. అనంతరం ధ్యాన మందిర శిక్షకులు శేరి భిక్షమయ్య కుటుంబ సభ్యులు యాదమ్మ, ఎస్పీ రాజేంద్రప్రసాద్, ఏసీపీ గిరిప్రసాద్, గాయత్రీ గ్రానైట్ జనరల్ మేనేజర్ ఈశ్వరప్రసాద్‌లను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జోనల్ సెక్రటరీ ఎస్‌వీ.కృష్ణారావు, జోనల్ ఇన్‌చార్జ్ కడియాల రాధాకృష్ణ, సాయిరాం, రమణ, ప్రొఫెసర్ ఖమ్రుద్దీన్, ఎంపీపీ పద్మ వెంకట్‌రెడ్డి, సర్పంచ్ చెవుల రాధముత్తయ్య తదితరులు పాల్గొన్నారు

సింగరేణి ప్రైవేటీకరణకు కుట్ర

టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కోదండరామ్


సభలో అభివాదం చేస్తున్న కోదండరామ్, ఇతర సంఘాల నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థను ప్రైవేట్ పరం చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్ర పన్నుతున్నాయని టీజేఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్ అన్నారు. ఈ కుట్రలను తిప్పికొట్టేందుకు కార్మికులు మిలిటెంట్ పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కొత్త గూడెం సీఈఆర్ క్లబ్‌లో ఆదివారం నిర్వహించిన కార్మిక ఐక్య వేదిక సభలో ఆయన మాట్లాడారు. వెనకబడిన ప్రాంతాల అభివృద్ధికి పునాదిగా ఉన్న సింగరేణిని ప్రైవేటీకరించడమంటే ప్రభుత్వ రంగాన్ని ధ్వంసం చేయడమేనని అన్నారు. తెలంగాణ వస్తే ఆంధ్ర పాలకుల దోపిడీ పోతుందని, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆశించామని, కానీ అందుకు భిన్నంగా సింగరేణిలో పర్మనెంట్ కార్మికులకు కుదించి వారి స్థానంలో 30 వేల మంది కాంట్రాక్ట్ కార్మికులతో పనిచేయిస్తూ శ్రమదోపిడీకి పాల్పడుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంఎస్, ఐఎఫ్‌టీయూ, టీఎస్‌టీయూసీ సంఘాల రాష్ట్ర అధ్యక్షులు రియాజ్ అహ్మద్, టి.శ్రీనివాస్, సాధినేని వెంకటేశ్వరరావు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.